## బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి యువకుడికి తీవ్రగాయాలు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 08 : యడ్లపాడు :** బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ పోల్స్, ఇనుప కంచెలను ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ నాగిశెట్టి సాంబశివరావు కుమారుడు నాగిశెట్టి రమేష్ బోయపాలెం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ పోల్స్, ఇనుప కంచెలను ఢీకొని వాటిని తెంచుకుంటూ సుమారు 15 మీటర్ల దూరంలో ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో యువకుడి కంటికి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పొలం పనులకు వెళ్తున్న స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.


# పెన్ పవర్
## సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల


# శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, జాబ్‌మేళాల నిర్వహణ
## : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**మహిళల్లో దాగి ఉన్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీస్తున్న రైజ్ కేంద్రం**
**మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**గ్రామీణ మహిళలకు శిక్షణ, మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం**
**మార్కెటింగ్ అవకాశాలతో మహిళలకు అండగా రైజ్ కేంద్రం**
**గుంటుపల్లి రైజ్ కేంద్రంలో సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌పో**
**ఎక్స్‌పోలో 27 స్టాళ్లను పరిశీలించిన కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**
**ప్రతి శనివారం వర్క్‌షాప్‌లు.. ఎప్పటికప్పుడు జాబ్‌మేళాలు**
**ఇప్పటికే 30 వర్క్‌షాప్‌లు.. 5 వేల మంది మహిళలకు చేరువ**
**స్వయం ఉపాధి నుంచి పారిశ్రామికవేత్తలుగా మహిళల ఎదుగుదల**
**ఆలోచన నుంచి ఆచరణ వరకు మహిళలకు రైజ్ చేయూత**
**మైక్రో, మినీ ఫుడ్ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక శిక్షణ**
**విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం**







**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** మహిళల్లో దాగిఉన్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా రైజ్ కేంద్రం విశేషంగా కృషిచేస్తోందని.. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం, మార్కెటింగ్ అవకాశాలను అందిస్తూ రైజ్ కేంద్రం ఒక ప్రత్యేక గ్రామీణ ఇంక్యుబేషన్ సెంటర్‌గా ఎదుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి రైజ్ కేంద్రంలో జరిగిన సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌పోను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రైజ్ కేంద్రం చేయూతతో ఏర్పాటుచేసిన పారిశ్రామిక యూనిట్ల ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన 27 స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో గౌరవ ముఖ్యమంత్రి దార్శనికత అయిన ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త మైలురాయిని చేరుకునేందుకు రైజ్ కేంద్రం కీలక ముందడుగా నిలుస్తోందన్నారు. ఈ కేంద్రంలో ప్రతిరోజూ శిక్షణ కార్యక్రమాలతో పాటు ప్రతి శనివారం వర్క్‌షాప్‌లు, ఎప్పటికప్పుడు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధంగా ఇప్పటికే 30 వర్క్‌షాప్‌లు నిర్వహించామని.. అయిదువేల మంది మహిళలకు చేరువయ్యామని తెలిపారు. వీరిలో ఇప్పటికే చాలామంది పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటుచేసి విజయవంతంగా ముందుకెళ్తున్నారన్నారు. ఆలోచన నుంచి ఆచరణ వరకు రైజ్ కేంద్రం ద్వారా మహిళలు తమలోని నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకునేలా ప్రోత్సహించడంతో పాటు, చిన్నస్థాయి వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. మైక్రో, మినీ ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటివాటిలో స్వయం ఉపాధి నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న మహిళల విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా రైజ్ కేంద్రం దోహదపడుతోందని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత.. కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. స్థానికంగా లభించే వనరులు, నైపుణ్యాలు, మహిళల సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, బ్రాండింగ్‌పై దృష్టిసారించేలా చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు, మార్కెట్ అవకాశాలతో అనుసంధానం కల్పిస్తూ వారి యూనిట్లు స్థిరంగా అభివృద్ధి చెందేలా రైజ్ తోడ్పాటు నందిస్తున్నట్లు వివరించారు. సమాజంలో పారిశ్రామిక రంగంలో విజయవంతంగా ముందుకెళ్తున్న ఎందరో మహిళలు మార్గదర్శులుగా వ్యవహరిస్తూ పీ4 స్ఫూర్తిని చాటిచెబుతున్నారని, రిసోర్స్ పర్సన్స్‌గా సేవలందిస్తున్నారని వివరించారు. ఏఐ వంటి ఆధునిక సాంకేతికతపైనా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికత వినియోగంపైనా శిక్షణ ఇచ్చి, నైపుణ్యాలు అభివృద్ధి చేసి మహిళలు మంచి ఉద్యోగాలు పొందడం రైజ్ కేంద్రం విజయానికి ప్రతీక అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ తదితరాలపైనా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఒక నైపుణ్యం ఉండాలి.. ఆ నైపుణ్యం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ కూడా మద్దతిస్తోందన్నారు. స్థానిక శాసనసభ్యులు, ఎంపీ కూడా ఈ కేంద్రానికి చేయూతనందిస్తున్నారని.. డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖ సమన్వయంతో ఈ కేంద్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్హతలతో సంబంధం లేకుండా ఔత్సాహిక మహిళలు ఎవరైనా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీపీఎం ఎ.శ్రీనివాసరావు, రైజ్ మేనేజర్ బి.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి
### : జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** గుంటూరు, ఆగస్టు 08: ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రూ.175 కోట్లతో 710 అభివృద్ధి పనులు పూర్తి చేశామని, 127 మందికి కారుణ్య నియామకాలు చేపట్టామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడంతో నీటి లభ్యత తక్కువగా ఉందని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4,400 టన్నుల డీఏపీ, 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. డీఏపీ పేరుతో అనధికారిక మిక్స్ ఫర్టిలైజర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ డెల్టా ప్రాంత రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. గుంటూరు ఛానల్ కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అందించాలని సభ్యులు కోరగా, ఇప్పటివరకు రూ.38.43 కోట్ల పరిహారం చెల్లించామని జడ్పీ సీఈఓ జ్యోతి బసు తెలిపారు. సమావేశంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ మరి రాజశేఖర్, ఎమ్మెల్యేలు, అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి సంక్షేమానికి చిరునామా



**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 8 :** గూడూరు గ్రామంలోని కాగిత వెంకటరావు కాలనీ, 34వ బూత్ పరిధిలో కూటమి నాయకులు శుక్రవారం 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించేందుకు కూటమి నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు అన్నం హరిరామకృష్ణ, పోతన రామోజీ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్.ఏ. బేగ్, మండల టీడీపీ కార్యదర్శి యారా ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ అట్లూరి శ్రీను, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ బేతాళ స్వామి, జనసేన పార్టీ గూడూరు గ్రామ అధ్యక్షుడు బాసంశెట్టి విజయ్, పోతన రంగ, శిలం పవన్ కళ్యాణ్, సాతా కుమారస్వామి, కొలుసు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పంట బీమాతో రైతులకు భరోసా : ఏవో ఎస్. జెన్నీ




**పెడన,పెన్ పవర్, ఆగస్టు 8:** బల్లిపర్రు గ్రామంలో శుక్రవారం 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంట బీమా ప్రాధాన్యతను వివరించి, ప్రతి రైతు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట రుణం తీసుకోని రైతులు మీ–సేవా కేంద్రాల్లో, పంట రుణం తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకులు లేదా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో ప్రీమియం చెల్లించి పంట బీమా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పంట బీమా రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సజ్జా జెన్నీ రైతులకు పంట బీమా నమోదు విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న పంట బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)పై విజయవాడలో జిల్లా స్థాయి వర్క్‌షాప్




**విజయవాడ,పెన్‌పవర్,ఆగస్టు08:** స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమం అమలు, గ్రామీణ పారిశుధ్యం, ఘన––ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై కృష్ణా మరియు ఎన్టీఆర్ జిల్లాలకు సంబంధించిన జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు కృష్ణా మరియు ఎన్టీఆర్ జిల్లాల నుండి డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు మరియు పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్––X నుంచి గ్రేడ్––ఎ వరకు అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.సుధాకర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన––ద్రవ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణ, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జె. అరుణ, కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత, పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

## సిద్ధార్థ మెడికల్ కాలేజీకి రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాల విరాళం






**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 8:** సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు తమ మాతృసంస్థపై ఉన్న మమకారంతో రూ.75 లక్షల విలువైన 15 అత్యాధునిక వైద్య పరికరాలను ఆసుపత్రికి విరాళంగా అందించారు. విద్యార్థులకు ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. తాము విద్యనభ్యసించిన మాతృసంస్థకు పూర్వ విద్యార్థులు తిరిగి సేవలందించడం అభినందనీయమన్నారు. సమాజానికి ఉపయోగపడే వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా వారు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. అత్యాధునిక పరికరాల ద్వారా రోగులకు మరింత వేగవంతమైన, సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. విరాళంగా అందించిన పరికరాల్లో స్టెరైల్ కనెక్టింగ్ డివైజ్ కీలకమైనదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వై.రావు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులకు తక్కువ మోతాదులో రక్తాన్ని సురక్షితంగా సరఫరా చేయడంలో ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆధునిక జెల్ టెక్నాలజీతో రక్త అనుకూలత పరీక్షలు, రక్త మార్పిడి ప్రక్రియలను మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. గత ఆరు నెలల్లో సుమారు 6 వేల మంది రోగులకు రక్తం సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్త పరికరాల అందుబాటుతో భవిష్యత్తులో మరింత మెరుగైన రక్త మార్పిడి సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.వై.రావు, పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ డాక్టర్ అమన్న, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజిత తదితరులు

## మానవాళి అభ్యున్నతి కొరకే సిపిఐ పాదయాత్రలు : మేడాహనుమంతరావు

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** మార్పు కావాలి అని నినాదంతో భారతదేశ వ్యాప్తంగా కొనసాగుతున్న సిపిఐ పాదయాత్రలు నేడు గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో కొత్తపేట ప్రాంతంలో జరిగాయి. నేడు కొత్తపేటలోని సర్దార్ భగత్ సింగ్ విగ్రహం వద్ద సిపిఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మేడా హనుమంతరావు ప్రారంభించగా సర్దార్ భగత్ సింగ్ విగ్రహానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అవినీతి,అక్రమాలకు కేంద్రంగా మారిపోయిందని రాముడు పేరుతో దేశ ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన బిజెపి నాయకులు రామ మందిరంలో ఆ రాముడు సొమ్మునే సుమారు 200 కోట్లు పైగా దోచుకున్నారని బిజెపి నాయకులకు రాముడు పైన ప్రేమ కన్నా రాముడు పేరుతో వచ్చేటువంటి ఓట్లపైనే మమకారం ఎక్కువని వారన్నారు. ఈ విషయంపై ప్రశ్నిస్తున్న వారిని సొమ్ములు ఇచ్చింది హిందువులు దొంగలించింది హిందువులు మీకేంటి అభ్యంతరం అని తిరిగి ప్రశ్నించడం వారి మతతత్వ రాజకీయాలకు నిదర్శనమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని, సిపిఐ గుంటూరు నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న, దూపాటి వెంకటరత్నం, చల్ల మరియదాసు మంగ శ్రీనివాసరావు, జంగాల చైతన్య,బి.వెంకటేశ్వరరెడ్డి,పరిమళ బన్నీ, నగర సంగతి సభ్యులు




తిరుమల, ఆకిటి రామచంద్రుడు, మిరియాల కోటేశ్వరరావు, చోవుల పున్నయ్య, అజయ్, మొహిద్దిన్ పీరా తదితరులు పాల్గొన్నారు. అభినందనలతో, ఆకిటి అరుణ్ కుమార్, సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి.

# కళాకారుల ప్రతిభను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే 'అమరావతి చిత్రకళా వీధి' మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ





**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 08 :** సృజనాత్మకతను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే 'అమరావతి చిత్రకళా వీధి' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. గుంటూరులో నిర్వహిస్తున్న చిత్రకళా ప్రదర్శనను సందర్శించిన ఆమె కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. 'అమరావతి చిత్రకళా వీధి' వినూత్నమైన కాన్సెప్ట్‌తో నిర్వహించడం అభినందనీయమన్నారు. సాధారణంగా ఆర్ట్ ఎగ్జిబిషన్లు గ్యాలరీలు, చిన్న హాళ్లకే పరిమితమవుతాయని, అయితే ప్రజల మధ్య ఓపెన్ ప్లాట్‌ఫామ్‌పై కళాకారుల చిత్రాలను ప్రదర్శించడం ద్వారా వారి ప్రతిభను విస్తృతంగా పరిచయం చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. టూరిజం అంటే కేవలం ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించడం మాత్రమే కాదని, అక్కడి కళ, సంస్కృతి, సంప్రదాయాలను ప్రజలకు పరిచయం చేయడం కూడా ముఖ్యమన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్, తేజస్వి, వారి బృందం ప్రతి రెండు మూడు నెలలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అమరావతి ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన భావోద్వేగంతో ముడిపడి ఉందని, గుంటూరు ప్రజలు అమరావతి కోసం అందించిన మద్దతు చిరస్మరణీయమని శైలజ అన్నారు. అమరావతిని కేవలం అభివృద్ధి కేంద్రంగానే కాకుండా కళ, సంస్కృతి, సృజనాత్మకతకు డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచన అభినందనీయమన్నారు. కళను బతికిస్తే మన సంస్కృతి బతుకుతుంది. కళాకారులను ప్రోత్సహిస్తే మన సంప్రదాయాలు మరింత ముందుకు వెళ్తాయి" అని డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు.

# బాలల పార్లమెంట్ మరియు కిశోర బాలికల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు మరియు బలోపేత కార్యక్రమం







**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ మరియు కిశోర బాలికల హక్కుల ఆధారిత ఉద్యమం కోసం ఏర్పాటు మరియు బలోపేతం"అనే కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పెద్దిపాగ అనిల్ కుమార్ మాట్లాడుతూ బాలలు మరియు కిశోర బాలికలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందింప చేయడం మరియు సమాజంలో వారికి ఎదురయ్యే సమస్యలను స్వయంగా వ్యక్తపరచుకునే, పరిష్కార మార్గాలు కనుగొనే ధైర్యం కల్పించడం అని బాలల హక్కులు, ఉచిత నిర్బంధ విద్య హక్కు, సంపూర్ణ ఆరోగ్య హక్కు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. తరువాత అత్తోట పోతురాజు మాట్లాడుతూ పిల్లలలో చిన్న నాటి నుండే సామాజిక స్పృహ కలిగి ఉండాలని, విలువలతో కూడిన విద్యను, సోదర భావం కలిగించే విధంగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు నేర్పించాలి అని బాలల పార్లమెంట్ నిర్మాణం గురించి, అందులో సభ్యుల బాధ్యతలు విధులు గురించి,కిశోరబాలికలో లింగ సమానత్వం, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం,ఆరోగ్యం మరియు భద్రత వంటి విషయాల గురించి అలానే గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వాటిపై సంబంధిత అధికారులకు తెలియజేసే విధంగా పిల్లలకు చైతన్యం కల్పిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, బాలల పార్లమెంట్ సభ్యులు, కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్ భాగ్యమ్మ , ఆశా వర్కర్లు, వి.సి.పి.సి కమిటీ సభ్యులు మరియు ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాట్ హోల్ రిపేర్ మెషిన్ ద్వారా శరవేగంగా రోడ్ల మరమ్మతులు కమిషనర్ కె.మయూర్ అశోక్





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** గుంటూరు నగర పరిధిలోని రహదారులను సురక్షితంగా, గుంతలు లేకుండా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధునాతన 'పాట్ హోల్ రిపేర్ మెషిన్' సహాయంతో రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేసినట్లు గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో పాట్ హోల్ రిపేర్ మెషిన్ ద్వారా అత్యంత తక్కువ సమయంలో, నాణ్యతతో గుంతలను పూడ్చడం జరుగుతుందన్నారు. ఇప్పటికే వార్డ్ ల వారీగా షుమారు 8 వందలు పాట్ హోల్స్ ని గుర్తించారని, వాటిలో 540 వరకు మరమత్తు చేశారని తెలిపారు. పాట్ హోల్స్ మెషిన్ ద్వారా సాంప్రదాయ పద్ధతుల కంటే వేగంగా పనులు పూర్తవ్వడంతో నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రహదారులను పునరుద్ధరించగలుగుతున్నారు. పనులను నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా, ఇంజనీరింగ్ అధికారులను క్షేత్రస్థాయిలోనే ఉండి పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా వాహన రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రధాన కూడళ్లు, బస్ రూట్లు, పాఠశాలలు మరియు ఆసుపత్రుల పరిసర ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ ఈ మరమ్మతులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ప్రజలా నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు క్రోడీకరించి, గుంతలు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే ఈ మెషిన్ ద్వారా పూడ్చివేత పనులు చేపడుతున్నారు. రహదారులపై ప్రయాణం సురక్షితంగా ఉండేలా ముమ్మరంగా ఈ మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు.

# ఏపీటీడీసీ ఆధ్వర్యంలో విజయవాడ వాడపల్లి - విజయవాడ ఒక రోజుటూర్ ప్యాకేజీ ప్రారంభం




**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విజయవాడ- వాడపల్లి - విజయవాడ వాహన బస్సును శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రం వద్ద ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు, పర్యాటకులకు అధునాతన సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించటంలో భాగంగా ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన అన్నారు. ప్రతీ శనివారం ఉదయం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు తిరిగి విజయవాడ చేరుకుంటామన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ. 1,160/-, పిల్లలకు రూ. 1,000/- గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో సౌకర్యవంత బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని అన్నారు. ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు మరియు పర్యాటకులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టి ఎస్ వి నారాయణ తెలిపారు.

# కళలు గోడల మధ్య కాదు.. ప్రజల మధ్యకు రావాలి : మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్





**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 08 :** కళలు కేవలం గోడల మధ్యనే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు రావాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక మరియు సాంస్కృతిక కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని కొరిటెపాడులో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న "అమరావతి చిత్రకళా వీధి" కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారులు, శిల్పకారులు, విద్యార్థులను ఉద్దేశించి డా. పెమ్మసాని మాట్లాడుతూ.. కళలు మానవాళి కనుగొన్న అత్యంత ప్రాచీనమైన భాష అని అన్నారు. అక్షరాలు పుట్టకముందే మనిషి తన ఆలోచనలను చిత్రాలు, శిల్పాల రూపంలో వ్యక్తం చేశాడని, వేల సంవత్సరాల నాటి కళారూపాలు నేటికీ చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మనం సృష్టించే కళలు కూడా భవిష్యత్ తరాలకు చరిత్రగా మిగులుతాయని అన్నారు. కళలు ఒక జాతి సంస్కృతికి ప్రతిబింబం, సమాజ చరిత్రకు సాక్ష్యం, తరతరాల వారసత్వానికి ప్రతీక అని తెలిపారు. కళాకారులకు గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు గుంటూరుకు, ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి తీసుకురావాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్న సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కల్చర్ అండ్ క్రియేటివిటీ చైర్‌పర్సన్ తేజస్విని పొడబాటిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది రాజమండ్రిలో సుమారు 500 మంది కళాకారులతో కార్యక్రమం నిర్వహించగా, ఈసారి గుంటూరులో దాదాపు 800 మంది కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి పనుల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నప్పటికీ కళాకారులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీసులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమన్వయం చేసి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు కొంత అసౌకర్యం కలిగినా కళాకారులను ప్రోత్సహించేందుకు గుంటూరు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లేదా డాక్టర్ కాలేరని, ప్రతి వ్యక్తిలోని ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసే అవకాశాలు సమాజంలో ఉండాలని అన్నారు. కళలు మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు కొత్త ఆలోచనలు, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. గుంటూరు ప్రజలు అమరావతి చిత్రకళా వీధి ని సందర్శించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శిల్పకళ, జానపద, సాంప్రదాయ, ఆధునిక కళారూపాలను ఆస్వాదించాలని డా. పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. విద్యార్థులు కళాకారులతో మమేకమై వారి అనుభవాలను తెలుసుకుని కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. కళాకారులకు గుర్తింపు, గుంటూరుకు గౌరవం, ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి తీసుకువచ్చేలా "అమరావతి చిత్రకళా వీధి" వంటి కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తరించాలని డా. పెమ్మసాని ఆకాంక్షించారు.

# పెడనలో రూ.107.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

## -అభివృద్దే ధ్యేయంగా కూటమిపాలన




**పెడన,పెన్ పవర్, ఆగస్టు 8 :** పెడన పట్టణంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. పట్టణ ప్రజలకు ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే దృఢ సంకల్పంతో మొత్తం రూ. 107.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ద్వారా రూ. 102.80 కోట్ల నిధులను తీసుకువచ్చి పట్టణ తాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు ఎంపీ వెల్లడించారు. అలాగే అమృత్ 2.0 పథకం ద్వారా రూ. 4.20 కోట్లతో తాగునీటి పనులు, పైడమ్మ చెరువు పునరుద్ధరణకు రూ. 88 లక్షలు కేటాయించినట్లు వివరించారు. ఈ పనుల ద్వారా పెడన పట్టణంలోని ప్రతి కుటుంబానికి తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమన్నారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. వీజుఖా సంస్థ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని బాలశౌరి తెలిపారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను కేవలం మున్సిపల్ అధికారులు మాత్రమే పర్యవేక్షిస్తే సరిపోదని, ప్రజలు కూడా భాగస్వాములై పనులను పరిశీలించాలని ఎంపీ కోరారు. రూ. 102 కోట్లకు పైగా నిధులను తీసుకువచ్చి పట్టణ ప్రజల కోసం చేపడుతున్న ఈ పనులు సక్రమంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పనుల్లో ఎక్కడైనా నాణ్యత లోపాలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెడన పట్టణ అభివృద్ధికి ఇంత భారీ స్థాయిలో నిధులు రావడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని, రానున్న రోజుల్లో పట్టణంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని బాలశౌరి ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనరేషన్ జెడ్‌లో దేశభక్తి, అభ్యుదయ భావాలు పెంపొందించాలి

### ఊరూరా చైతన్య ప్రస్థానం -100 కళాయాత్రకు శ్రీకారం
### 2026 - 27లో ఏడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు
### జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి




**వేదుళ్లపల్లి, పెన్ పవర్, ఆగస్టు 8 :** క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైన ఆగస్టు 8వ తేదీ స్ఫూర్తితో జనరేషన్ జెడ్ నూతన తరంలో దేశభక్తి, శాస్త్రీయ దృక్పథం, అభ్యుదయ భావజాలాన్ని పెంపొందించేందుకు 'ఊరూరా చైతన్య ప్రస్థానం--100' పేరుతో రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా వేదుళ్లపల్లి చైతన్య భవన్‌లో 2026--27 సంవత్సరానికి సంబంధించిన ఒక సంవత్సరం కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దాదాపు 80 ఏళ్లలో మూడు తరాలు గడిచిపోయాయని, ప్రస్తుతం జనరేషన్ జెడ్ నూతన తరం అభివృద్ధి చెందుతోందన్నారు. గత తరాల త్యాగాలు, భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, రాష్ట్ర చరిత్ర, వర్తమాన పరిస్థితులు, భవిష్యత్ సవాళ్లపై యువతలో చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యంతో ఏడాది పాటు విస్తృత స్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఇండియా--1947--2047' కార్యక్రమం స్ఫూర్తితో 2026--27 సంవత్సరాల్లో దీర్ఘకాలిక ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100 కేంద్రాల్లో పది అంశాల ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు 30 కేంద్రాల్లో విశాల ఐక్యవేదికలను ఏర్పాటు చేసి చైతన్య సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా ఐదు ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని సాంస్కృతిక కళాబృందాలతో కలిసి చైతన్య కళాయాత్రలు చేపట్టనున్నామని, ఘంటసాల విగ్రహాలు ఉన్న 30 ప్రాంతాలను సందర్శించి సామాజిక చైతన్య కార్యక్రమాలతో పాటు ఘంటసాల సంగీత విభావరి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా '50 ఏళ్ల అభ్యుదయ ఉద్యమ ప్రస్థానం--అనుభవాలు' పేరుతో పుస్తకాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందులో శ్రీమతి ఝాన్సీరాణి సంస్మరణకు ప్రత్యేక స్థానం ఉంటుందని పేర్కొన్నారు.

**పది అంశాలపై చైతన్య కార్యక్రమాలు :** 2026--27లో చేపట్టనున్న పది అంశాల కార్యక్రమాల్లో భాగంగా ఆదిమానవుల నుంచి ఆధునిక మానవుల వరకు సమాజ పరిణామ క్రమం, శాస్త్రీయ భావజాలం, జనరేషన్ జెడ్ యువత కోసం 'విద్యార్థులు నవ సమాజ నిర్మాతలు రా' కార్యక్రమం, భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో నాడు--నేడు--రేపు, రాజ్యాంగ అమలు మరియు రాజ్యాంగ లక్ష్యాల పరిరక్షణ, 2014--2026 మధ్య నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధి--పునర్నిర్మాణ సమస్యలు, ప్రపంచ శాంతి, పర్యావరణ చైతన్యం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే సాహిత్యం, ఘంటసాల సంగీతం, ప్రపంచానికి తాత్విక బోధనలు వంటి అంశాలపై కూడా సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. నాడు--నేడు--రేపు అనే అభ్యుదయ దృక్పథంతో యువతను సామాజిక మార్పులో భాగస్వాములను చేయడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే అంజిబాబు, తాళ్లూరి శ్రీదేవి, కోట విశ్వశాంతి, అక్షర దీప్తి, జనన్య జ్యోతి, మరప్రోలు శివారెడ్డి, గురజాల శ్రీనివాసరావు, మిరియాల సుబ్బారావు, సీతారాం, సీతారామిరెడ్డి, కోట లోకేష్, భోగిరెడ్డి దినేష్, కేవీ ఈ నారాయణ, అక్కల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


# సేవా స్ఫూర్తితో.. ప్రతి నెలా 100 మందికి ఉచిత అల్పాహారం



**చీరాల, పెన్‌పవర్, ఆగస్ట్ 8:** సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుంటూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నేతాజీ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల రెండో శనివారం ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పేరాల చిన్న రథం సెంటర్‌లోని నేతాజీ విగ్రహం వద్ద 100 మందికి ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల నిరుపేదలు, అవసరమైన వారికి అల్పాహారం అందిస్తూ సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి తమవంతు సహకారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుండూరి కృష్ణమూర్తి, తడవర్తి చంద్ర, గంగవరపు ప్రసాద్, బోదరాజు శశికిరణ్, కొత్త వెంకటేశ్వర్లు, పిన్ని బోయిన శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహతి ఆడిటోరియంలో కళా వైభవం

### పుస్తకావిష్కరణ.. సందేశాత్మక నాటక ప్రదర్శన



**మచిలీపట్నం,పెన్ పవర్ ఆగస్టు 8:** భావ తరంగిణి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు భవిష్య రచించిన 'చీకటి వెనుక వెలుగు' సందేశాత్మక నాటక పుస్తకావిష్కరణ, నాటక ప్రదర్శన మహతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో త్యాగరాజ సంగీత విద్యాపీఠం అధ్యక్షుడు బి. హెచ్.వి.ఎల్. రాధాకృష్ణమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించగా, సాహితీ మిత్రుల అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ తొలి ప్రతిని స్వీకరించారు. సాహితీవేత్త డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్య, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ డిప్యూటీ చీఫ్ మేనేజర్ టి. పెద్దిరాజు ప్రసంగించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఉయ్యూరు డిప్యూటీ మేనేజర్ కేశన మనో సత్యనందిని జ్యోతి ప్రజ్వలన చేశారు. గాయని విజయలక్ష్మి ప్రార్థనా గీతం ఆలపించగా, కే. శిరీష స్వాగతం పలికారు. అనంతరం భవిష్య రచన, దర్శకత్వంలో 'చీకటి వెనుక వెలుగు' నాటకాన్ని ప్రదర్శించారు. అర్థం లేని ఆరాటం, అంతులేని పరుగు మధ్య మనిషి కోల్పోతున్న మనశ్శాంతిని నాటకం చాటిచెప్పింది. పోతిరెడ్డి విశల గౌరీశ్వరి 91 ఏళ్ల వయసులో ప్రత్యేక పాత్రలో పద్యాలు ఆలపిస్తూ అభినయించడం విశేష ఆకర్షణగా నిలిచింది. రావినూతల సత్యనారాయణ, డి. దత్తాత్రేయ శర్మ, వై. శ్రీరామ్, అద్దేపల్లి మల్లికార్జున ప్రసాద్, ఆర్. వెంకటేశ్వరరావు, కోసూరు ఈశ్వరరావు, పి. శాంతి తమ నటనతో నాటకాన్ని రక్తికట్టించారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారు

### కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి విడదల రజిని ఫైర్



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 08 :** పేటలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న తమను పోలీసులు బలవంతంగా అడ్డుకోవడంపై మాజీ మంత్రి విడదల రజిని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక మాజీ మంత్రి, పైగా మహిళ అని కూడా చూడకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, వేదిక పైనుంచి కిందకు ఈడ్చుకొచ్చారని ఆమె మండిపడ్డారు. యువత, విద్యార్థుల సమస్యల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంటే, ప్రతిపక్షాల గొంతు ప్రజల్లోకి వెళ్లకుండా కూటమి ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచివేయాలని చూస్తోందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ప్రజల్లో గ్రాఫ్ పడిపోయిందని రజిని ఎద్దేవా చేశారు. తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే 'రెడ్ బుక్' పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డీఎస్సీ వ్యవహారంలో జరిగిన అవకతవకలపై మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, లేదా సీబీఐతో విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే డిఫెన్స్‌లో పడిన ప్రభుత్వం ఈ విధంగా అరెస్టులకు పాల్పడుతోందని ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా, రోడ్డు పక్కన టెంట్ వేసుకుని శాంతియుతంగా దీక్ష చేస్తుంటే కనీసం పర్మిషన్ కూడా ఇవ్వలేదని రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ స్వార్థం కోసం కాకుండా ప్రజల కోసమే పోరాడుతున్నామని, ప్రభుత్వ తీరును ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. సరైన సమయం వచ్చినప్పుడు ఈ అన్యాయాలకు ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

# విద్యార్థుల చేతుల్లో పుస్తకం పెడితే భవిష్యత్తును పెట్టినట్టే ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 8 :** విద్యార్థుల చేతుల్లో పుస్తకం పెట్టడం అంటే వారి చేతుల్లో భవిష్యత్తును పెట్టడమేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి అన్నారు. శనివారం గుంటూరు నగరంలో గుంటూరు నగర విశ్వబ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితులు ఏ విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారకూడదన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీసీ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ టీడీపీ జిల్లా సాధికార కన్వీనర్ జంపని నాగేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ వ్యవస్థాపక అధ్యక్షులు చింతాడ బ్రహ్మానందరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నేడు పర్చూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

### శంకర్ కంటి ఆసుపత్రి, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్య నిపుణుల సేవలు



**పర్చూరు, పెన్‌పవర్, ఆగస్ట్ 8 :** నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. పర్చూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్, గ్రీన్స్ పార్క్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఈ శిబిరం జరగనుంది. శిబిరాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించనున్నారు. శంకర్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించనున్నారు. అలాగే ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన వివిధ విభాగాల ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు కూడా వైద్యులు అందించనున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమకు సమీపంలోనే ప్రముఖ వైద్య నిపుణుల సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్న ఆయన.. కంటి సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రముఖ వైద్య నిపుణులు అందుబాటులో ఉండనున్నందున ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు.

# డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ సమరభేరి!

### చీరాలలో మూడో రోజు రిలే నిరాహార దీక్షలు

### నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్న కరణం వెంకటేష్ బాబు






**చీరాల, పెన్‌పవర్, ఆగస్ట్ 8 :** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన ఉధృతమవుతోంది. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, చీరాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు పిలుపుతో బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ ప్రాంగణంలో శనివారం మూడో రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. దీక్షలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు కరణం వెంకటేష్ బాబు నల్ల కండువాలు కప్పి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సాయంత్రం 5 గంటల వరకు నిరాహార దీక్షలో కూర్చున్నారు. సాయంత్రం 5 గంటలకు కరణం వెంకటేష్ బాబు దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసిమళ్ల వాసు, చీరాల పట్టణ అధ్యక్షులు యాతం మేరి బాబు, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు అనిల్, కంపా అరుణ్, మాజీ కౌన్సిలర్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎస్సీ సెల్ కార్యదర్శి చిన్నబాబు, చెలి బాబురావు, చక్రవర్తి, బొల్లాపల్లి అనిల్, చీరాల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సల్లూరి అనిల్, వేటపాలెం మహిళా అధ్యక్షురాలు మహాలక్ష్మి, సల్లూరు నవీన్, పేతురు, ప్రచార కార్యదర్శి పూర్ణ, చీరాల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు పల్లెపు ఇమాన్యుయేల్, రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ వైస్‌చైర్మన్లు, జిల్లా నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు. మూడో రోజు రిలే నిరాహార దీక్షను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయపోరాటంలో నెగ్గలేనని తెలిసే.. జగన్, వీధిపోరాటాలతో రాజకీయ డ్రామా మొదలెట్టాడు : ప్రత్తిపాటి

### కోర్టు ఆదేశాలు, అధికారుల వివరణలు, యువత జీవితాల కన్నా... జగన్ కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం : ప్రత్తిపాటి



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 08 :** చిలకలూరిపేట : న్యాయస్థానాలు చీవాట్లు పెట్టినా... ప్రభుత్వం, అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినా మెగా డీఎస్సీపై జగన్ వైఖరి పాడిందే పాటరా అన్నతీరుగా ఉంది. జగన్ మెగా డీఎస్సీ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వినియోగించుకుంటూ, యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాడు. నిరసన దీక్షల పేరుతో ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించడం ముమ్మాటికీ వైసీపీ రాజకీయ డ్రామానే. న్యాయపోరాటాలు చేయడానికి సరైన ఆధారాలు లేనందునే జగన్.. వైసీపీ నేతలు చివరకు వీధిపోరాటాలకు దిగారు. రాష్ట్ర యువత జీవితాలు బాగుపడటం.. వారికి బంగారు భవిష్యత్ లభించడం జగన్ కు ఏ కోశానా ఇష్టం లేదు. తాను అధికారంలో ఉన్నప్పుడు జాబ్ క్యాలెండర్ , మెగా డీఎస్సీ పేరుతో యువతని మోసగించిన జగన్... చివరకు గంజాయి, మాదకద్రవ్యాలకు బానిసల్ని చేశాడు. ప్రపంచం గర్వించే ఏపీ యువత మేథస్సును, నాలుగ్గోడల్లో మగ్గిపోయేలా చేశాడు. యువతలో చైతన్యం ఉంటే... తన అవినీతి పాలన సాగదన్న దురాలోచనతోనే జగన్, వారి జీవితాల్ని మత్తులో ముంచేశాడు.

**డీఎస్సీలో అర్హులకు అన్యాయం జరిగిందంటున్న జగన్... వారి పక్షాన అసెంబ్లీలో మాట్లాడగలడా?**

చంద్రబాబు, లోకేశ్ లు పెట్టుబడులు, ఉద్యోగ నోటిఫికేషన్లతో యువతకు మంచి భవిష్యత్ అందించే ఆలోచనలు చేస్తుంటే... జగన్ వారిని రాజకీయపావులుగా వాడుకోవాలని చూస్తున్నాడు. చంద్రబాబు ఏఐ, క్వాంటమ్ రంగాల్లో రాష్ట్ర యువతకు శిక్షణ అందిస్తుంటే... జగన్ వారి చేతికి గొడ్డళ్లు, కత్తులిచ్చి రప్పా రప్పా రాజకీయం చేయించేందుకు ఆరాటపడుతున్నాడు. ఆకలి, అవసరాల కోసం ఏపీ యువత ఎప్పుడూ తన మోచేతి నీళ్లు తాగుతూ, తన కింద బతకాలన్నదే జగన్ దుర్మార్గపు ఆలోచన. పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీలో అక్రమాలని గగ్గోలు పెట్టడం. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్ని అడ్డుకోవడం, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారమివ్వడం వంటి జగన్ దుశ్చర్యలు దానిలో భాగమే. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో తప్పులు జరిగాయి.. అర్హులకు అన్యాయం జరిగిందని నిరూపించే ఆధారాలుంటే.. జగన్ వాటిని అసెంబ్లీలో బహిర్గతం చేయాలి. ఎంపిక చేసుకున్న మీడియా ముందు ప్రభుత్వంపై బురద జల్లకుండా.. చట్టసభలో గొంతెత్తి.. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి." అని ప్రత్తిపాటి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# చేనేత సభ విజయవంతం

### ఎమ్మెల్యే కుటుంబానికి ఘన సత్కారం



**చీరాల, పెన్ పవర్, ఆగస్ట్ 8 :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యతో పాటు ఆయన కుమారులు మహేంద్రనాథ్, గౌరీ అమర్నాథ్‌లను నాయకులు, అభిమానులు జీడిపప్పు మాలలు వేసి ఘనంగా సత్కరించారు. చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, ఆయన కుటుంబ సభ్యులు చేసిన కృషిని నాయకులు అభినందించారు. భారీగా ప్రజలు, చేనేత కార్మికులు, పార్టీ శ్రేణులు పాల్గొనడంతో సభ విజయవంతం కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీడిపప్పు మాలలు వేసి సత్కరిస్తూ ఎమ్మెల్యే మాలకొండయ్యతో పాటు మహేంద్రనాథ్, గౌరీ అమర్నాథ్‌లపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల నాయకులు, కార్యకర్తలు పరస్పరం అభినందనలు తెలిపారు.

# జాతీయ స్థాయి గరుడ అవార్డు పోటీలకు గోరంట్ల శింగర కొండయ్య చౌదరి ఎంపిక



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 08 :** చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పౌరాణిక కళాకారుడు, రాష్ట్ర తెలుగుదేశం సాంస్కృతిక విభాగం కార్యదర్శి గోరంట్ల శింగర కొండయ్య చౌదరి మరోమారు ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి గరుడ అవార్డు పోటీలకు ఎంపికయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే టీటీడీ సాంస్కృతిక విభాగమైన శ్రీ వెంకటేశ్వర నాట్య కళా పరిషత్, ధర్మప్రచార పరిషత్‌ల సౌజన్యంతో ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో గరుడ అవార్డు పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటోరియంలో జరగనున్న పోటీల్లో శింగర కొండయ్య చౌదరి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 'శ్రీకృష్ణ మహాప్రస్థానం'లోని శ్రీకృష్ణుడి పాత్రను ఏకపాత్రాభినయం ద్వారా ప్రదర్శించనున్నారు. పౌరాణిక కళారంగంలో తనదైన ప్రతిభను చాటుకుంటున్న శింగర కొండయ్య చౌదరి మరోసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఎంపిక పట్ల నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు, మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, చిట్టిపోతు మస్తానయ్య, పేర్ని వీరనారాయణ, తేలప్రోలు వీరయ్య చౌదరి, బొల్లేపల్లి సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి : వైసిపి డిమాండ్



**బాపట్ల:( పెన్ పవర్ )** బాపట్ల డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చీల్ రోడ్డు సెంటర్లో మూడవ రోజు నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. కర్లపాలెం మండల వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఈ నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. వ్యవహారంపై స్వతంత్రంగా సీబీఐ విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు హామీ ఇచ్చిన నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాపట్ల,కర్లపాలెం మరియు పివి పాలెం మండలం పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

# వైభవంగా శ్రీ శ్రీ కృష్ణ బలరామ రథయాత్ర





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 8:** బుచ్చి పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ కృష్ణ బలరామ రథయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని రథంలో కొలువు తీర్చి స్వామివారిని ప్రత్యేక పుష్పలంకరణ చేశారు. అర్చకులు హారతి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైభవంగా రథోత్సవం సాగింది. రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. చిన్నారులవివిధ దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోలాటాలు భక్తులు తో వైభోగంగా సాగింది

# డీఎస్సీ అక్రమాలపై న్యాయం జరిగే వరకు పోరాటం

## మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 8 :** డీఎస్సీ అక్రమాలపై న్యాయం జరిగే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కెలివేటి సంజీవయ్య తెలియజేశారు.వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు... డీఎస్సీలో జరిగిన అక్రమాలపై, అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని,బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 3వ రోజు నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా.కాకాణి గోవర్ధన్ రెడ్డి,తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ అబ్జర్వర్ బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి,తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి లు మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులను దగా చేశారని శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,డీఎస్సీ అభ్యర్థులపై కూటమి పార్టీలకు చెందిన రౌడీ మూకలు దాడులు చేయడం నియంతపాలనకు అద్దం పడుతుందని అన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యతిరేకిస్తూ దేశ రాజధానిలో యువత,విద్యార్థులు కదం తొక్కి నిరసనగలం విప్పితే సాక్షాత్తు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేశారని తెలిపారు.రాష్ట్రంలో



జరిగిన డీఎస్సీ పరీక్షలో స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవినీతి,అక్రమాలు ఆడియోలతో సహా బయటకు వచ్చిన ఈ కూటమి ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందన్నారు.స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవినీతి, ఆక్రమాలకు బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని,ఈ అవకతవకలపై సిబిఐతో విచారణ చేయాలి, ఎన్నికల సమయంలో ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిరుద్యోగభృతి మూడు వేల రూపాయలను వెంటనే అమలు చేయాలని, అలాగే విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గత రెండు రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుంటే ఈ కూటమి ప్రభుత్వం ఏమాత్రం చలనం లేకుండా నిరుద్యోగుల ఆవేదన,అర్హులైన అభ్యర్థుల కన్నీరు ఏమాత్రం కూడా పట్టించుకోకుండా హిట్లర్ పాలను తలపించేలా ఈ కూటమి ప్రభుత్వం నేడు పరిపాలన చేస్తుందన్నారు. రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి,తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసీపీ జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, వైసీపీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,ఎస్.ఆర్.సీ.సభ్యులు దబ్బల శ్రీమంత్ రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, పల్లకూరు మండల జడ్పిటిసి సభ్యులు నందం ప్రిస్కిల్లా నాయుడుపేట ఎం.పి.పి కురుగొండ ధనలక్ష్మి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కటకం దీపిక, వైసీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కట్టా భవాని శంకర్ రెడ్డి,వైసీపీ లీగల్ సెల్ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షులు చదలవాడ కుమార్,క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు కాళహస్తి భావన అనుదీప్,వైసీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ షబ్బీర్,నియోజకవర్గ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పాలేటి నాగార్జున, నాయకులు బైనా మల్లికార్జున్ రెడ్డి,పేట చంద్రారెడ్డి పేర్నాటి రాహుల్, పలువురు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# వాసుదేవపురం లో టిడిపి ఇంటింటి ప్రచారం



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 8 :** నాయుడుపేట మండలంలోని కాపులూరు పంచాయతీ వాసుదేవపురం గ్రామంలో శనివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులురు చక్రపాణి ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇంటింటా ప్రచారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి,సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం రానున్న స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులురు దయాకర్, కాపులూరు అనిల్ కుమార్, కోడివాక రామయ్య,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం

## నీటి కొరతపై రైతులను అప్రమత్తం చేయాలి: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 08 :** గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వర్షాలు లేనప్పుడు ఏ పంటలు వేయాలో అధికారులను అడిగే ప్రజాప్రతినిధులు.. డీఏపీ, యూరియా వంటి ఎరువులను అధికంగా వినియోగించవద్దని అధికారులు సూచిస్తే ఆ విషయాన్ని రైతులకు ఎందుకు వివరించరని జడ్పీటీసీలను ఉద్దేశించి అసహనం వ్యక్తం చేశారు. వర్షాలు పడనప్పుడు ప్రభుత్వం ఏదో వాగ్దానం చేసిందని విమర్శించడం కంటే, అందుబాటులో ఉన్న నీటిని ఎలా సర్దుబాటు చేసుకోవాలో సభలో చర్చించాలని సూచించారు. వర్షాలు లేకుండా పండే పంటలను తన జీవితకాలంలో ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి వస్తున్న నీరు కేవలం తాగునీటికి, నిల్వ చేసుకోవడానికి మాత్రమే సరిపోతుందన్న విషయాన్ని జిల్లా పరిషత్ ద్వారా రైతులకు తెలియజేయాలని సూచించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో సాగుకు



అవసరమైనంత నీరు లేదని స్పష్టం చేశారు. గోదావరి జలాలు వస్తున్నందున కృష్ణా డెల్టా రైతులకు మాత్రమే నీరు అందుతోందని, సాగర్ ఆయకట్టుకు నీరు ఇచ్చే పరిస్థితి లేదని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేసి నష్టపోవద్దని, వర్షాలు కురిస్తే మెట్ట పైర్లు వేసుకునేలా రైతులను చైతన్యపరచాలని ఎమ్మెల్సీ కోరారు. ఒకవేళ వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతో పాటు జడ్పీటీసీలకు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జడ్పీ సీఈఓ జ్యోతి బసు, మూడు జిల్లాలకు చెందిన జడ్పీటీసీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎమ్మెల్సీ అరెస్ట్

## జమ్మలమడుగులో తీవ్ర ఉద్రిక్తత



డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కడప జిల్లా జమ్మలమడుగులో వైసీపీ చేపట్టిన నిరసన దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతి లేదంటూ పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి దీక్షా శిబిరానికి చేరుకోవడంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆయన భార్య ఇందిరమ్మతో పాటు అక్కడికి చేరుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో పోలీసులకు, వైకాపా శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరగడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ప్రస్తుతం అక్కడ భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు.

# నారా లోకేశ్ తో విద్యా విప్లవం

## ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 08 :** ఆంధ్రప్రదేశ్ లో విద్యా రంగాన్ని ఆధునిక సాంకేతికతతో, నాణ్యమైన ప్రమాణాలతో ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు అద్భుతంగా ఉన్నాయని రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక 12వ డివిజన్ లాలాపేట పాత బస్టాండ్ సెంటర్లో శనివారం రెండేళ్ల పాలనపై నమ్మకం-అభివృద్ధి సంక్షేమంలో భాగంగా మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. తమ ప్రాంతానికి వచ్చిన నాయకులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తమ ప్రాంతంలో కనీసం రోడ్లు కూడా లేవని, రెండేళ్లలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నసీర్ సహకారంతో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఐదేళ్లలో నిరుద్యోగ యువతను దారుణంగా మోసగించిన వైసీపీ.. ఇప్పుడు జెన్ జీ పేరిట దొంగ దీక్షలు చేస్తుంటే



ప్రజలు మండిపడుతున్నారని విమర్శించారు. అసలు జెన్ జీలో విద్యార్థులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్కటైనా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశారా అని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసిన వైసీపీకి యువత తగిన బుద్ధి చెప్పినా మార్పు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం, పీటీఎం వంటి కార్యక్రమాలతో విద్యా వ్యవస్థలో సువర్ణ అధ్యాయం లిఖించారని తెలిపారు. తరగతి గదుల్లో అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకొచ్చి నవయుగ విద్యా రథసారథిగా మారారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు డిజిటల్ విప్లవానికి వేదికగా మారాయని తెలిపారు. గ్లోబల్ లీడర్లుగా మన పిల్లలు ఎదగాలనే ఆశయంతో పని చేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సలీమ్, హఫీజ్, అబ్బులు, సమా, ఎస్ఎస్కే జాదా, అన్వర్, కిష్టి, అలీ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రియురాలి దారుణ హత్య

## కత్తితో పొడిచి, పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియుడు
## మిస్సింగ్ కేసును ఛేదించిన అర్బన్ రమేష్ ..నిందితుడి అరెస్ట్

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 08 :** ప్రేమించిన యువతి తనను కాదని వేరొకరికి దగ్గరవుతోందనే అనుమానంతో ఓ ఉన్మాది ప్రియురాలిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆపై సాక్ష్యాధారాలు మాయం చేసేందుకు మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి అసలు గుట్టు రట్టు చేశారు. ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలనుడి.ఎస్.పి ఎం. హనుమంతురావు శనివారం వెల్లడించారు.



**ప్రేమ, అనుమానం.. పథకం ప్రకారమే హత్య:** చిలకలూరిపేట పట్టణం వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్ వలి కుమార్తె షేక్ హసీనా ఏ యాస్మిన్ (23) తుమ్మలపాలెం హైవే వద్ద ఉన్న మిట్టపల్లి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం సూళ్లూరుపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. గుంటూరులోని చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువును మధ్యలో ఆపేసి, ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న కారంపూడి మండలం ఇనుపరాజుపల్లికి చెందిన జినుగు బాల సైదులు (25), హసీనాలు గత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.అయితే, ఇటీవల హసీనా తనతో తక్కువగా మాట్లాడుతుండటంతో.. ఆమె వేరే వ్యక్తికి దగ్గరవుతోందని, తనను కావాలనే దూరం పెడుతోందని సైదులు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆమెను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 4వ తేదీన హసీనాకు ఫోన్ చేసిన సైదులు, మాయమాటలు చెప్పి కారంపూడికి రప్పించాడు. మాట్లాడుకుందామని నమ్మించి, అక్కడి నుంచి కారంపూడి - నకరికల్లు రోడ్డులోని ఎన్ఎస్పీ కాలువ పశ్చిమ కట్ట వద్ద ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు.

**కత్తితో పొడిచి.. పెట్రోల్ పోసి దహనం :** ఎవరూ లేరని నిర్ధారించుకున్న సైదులు, ముందుగానే తన వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో దాడికి పాల్పడ్డాడు. తన ఎడమ చేతితో హసీనా గొంతు గట్టిగా పట్టుకుని, ఆమె కడుపులో మూడుసార్లు బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో హసీనా అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. హత్య అనంతరం సాక్ష్యాధారాలు దొరక్కుండా చేసేందుకు, తన బైక్‌లోని పెట్రోల్‌ను ఓ ఖాళీ వాటర్ బాటిల్‌లో పట్టి, మృతదేహంపై పోసి నిప్పంటించి అక్కడినుంచి పరారయ్యాడు.

**మిస్సింగ్ కేసు విచారణలో వెలుగులోకి :** కూతురు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడం, కనిపించకుండా పోవడంతో బాధితురాలి తండ్రి మస్తాన్ వలి చిలకలూరిపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ జె.వి. సంతోష్, నరసరావుపేట డి.ఎస్.పి ఎం. హనుమంతురావు ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టిన పోలీసులు.. ఆగస్టు 8న కారంపూడి పాత సినిమా హాలు సెంటర్ (హోండా షోరూం) వద్ద నిందితుడు సైదులును చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. మహిళ అదృశ్యం కేసును హత్య కేసుగా (సి ఆర్ నెంబర్ 214/2026 యూ/ఎస్ 103(1), 140(1), 238 బి ఎం ఎస్) మార్చారు. నిందితుడిని కోర్టులోహాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో చిలకలూరిపేట టౌన్ సీఐ పి. రమేష్, ఎస్ఐలు వి. సోమేశ్వరరావు, పి. హజరత్తయ్య, మరియు వారి సిబ్బంది కీలక పాత్ర పోషించటం జరిగిందని తెలిపారు.

# పంద్రాగస్టుకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా పంద్రాగస్టుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన తిరుపతిలోని తమ బంగ్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఇన్‌చార్జి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి, డీఆర్వో నరసింహులుతోపాటు పలువురు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో అధికారులు సమష్టిగా పని చేయాలని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు తిరుపతిలో జరుపుకోవడానికి అంతా సహకరించాలని కోరారు.

# నేడు ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

తిరుపతి సిటీ: ఈఏపీసెట్--2026 తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే రిజిస్ట్రేషన్‌తో పాటు వెబ్ఆప్షన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ర్యాంకుల ఆధారంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థుల మెరిట్ లిస్ట్‌ను సాంకేతిక విద్యాశాఖ ఆదివారం విడుదల చేయనుంది. విద్యార్థులు రిజిస్ట్రేషన్ సమయంలో పొందుపరిచిన మొబైల్ నంబర్లకు ఈ మేరకు సమాచారం పంపనున్నారు. ఆయా కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు 15వ తేదీలోపు రిపోర్ట్ చేసి ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది.

# 3వ రోజు రిలే నిరాహా దీక్ష

**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 8:** వై యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ మంత్రివర్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజు కోవూరులో కొడవలూరు మరియు విడవలూరు మండలాల నుంచి రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు కన్వీనర్ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, నాయకులు కార్యకర్తలతో కలసి 3వ రోజు నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు ముఖ్య ముఖ్యఅతిథిగా నెల్లూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ అరుణమ్మ పాల్గొన్నారు.

